# సాక్షి ప్రకాశం

గురువారం | 9 | మార్చి | 2023






**ధర స్థిరం.. అదే వరం**

పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతుల మోముల్లో చిరునవ్వులు విరబూస్తున్నాయి. ధర గరిష్టంగా రూ.200 పలికింది.

- 8లో..



**తాళ్లూరులో భారీ చోరీ**

తాళ్లూరులోని కిరాణా వ్యాపారి ఇంట్లో దుండగులు 66 సవర్ల బంగారం, రూ.4 లక్షల నగదు చోరీ చేశారు.

- 8లో..

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 33 /22

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్‌

### నేడు జాతీయ స్థాయిలో ఎడ్ల బండ పందెం

బేస్తవారిపేట: మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఈనెల 9వ తేదీన బేస్తవారిపేట జంక్షన్‌లో అఖిల భారత జాతీయ స్థాయిలో ఎడ్ల బండ పందెం నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు, మార్కాపురం కందుల ఓబులరెడ్డి వైద్యశాల చైర్మన్‌ డాక్టర్‌ కందుల గౌతమ్‌ నాగిరెడ్డి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గోవ, ఐదోవ, ఆరోవ, ఏడోవ, ఎనిమిదోవ బహుమతులుగా వరుసగా రూ.1,01,116, రూ.75,116, రూ.60,116, రూ.50,116, రూ.40,116, రూ.60,116, రూ.20,116, రూ.10,116లను అందజేస్తారన్నారు. బహుమతి లభించని ప్రతి ఎడ్ల యజమానులకు రూ.5,116 ఇస్తారని చెప్పారు. గురువారం ఉదయం 6 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 99120 12209, 99084 85646 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### నేడు ఇంటర్‌ పరీక్షల అధికారులకు శిక్షణ

ఒంగోలు: ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్‌ పబ్లిక్‌ పరీక్షల కోసం నియమితులైన చీఫ్‌ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్‌ ఆఫీసర్లు, కస్టోడియన్లు, స్పెషల్‌ కస్టోడియన్లు, సిట్టింగ్‌, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు, అదనపు చీఫ్‌ సూపరింటెండెంట్లకు పరీక్షల నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్‌ ప్రాంతీయ మండలి పర్యవేక్షణాధికారి ఎ.సైమన్‌ విక్టర్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణ స్థానిక ఆంధ్రకేసరి జూనియర్‌ కాలేజీలో జరుగుతుందన్నారు. కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమానికి నియమితులైన అధికారులంతా సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

### పోస్టల్‌ బ్యాలెట్‌ బాక్స్‌ సిద్ధం



ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టల్‌ బ్యాలెట్‌ పత్రాలను తరలిస్తున్న సిబ్బంది

ఒంగోలు అర్బన్‌: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఓటు వేసేందుకు పోస్టల్‌ బ్యాలెట్‌ బాక్సులను కలెక్టరేట్‌లో సిద్ధం చేశారు. బుధవారం పోస్టల్‌ బ్యాలెట్‌ వేసేందుకు ఖాళీ బ్యాలెట్‌ బాక్సును అన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డీఆర్‌ఓ చాంబర్‌లో సీలు వేశారు. ఇప్పటికే ఉద్యోగులకు పోస్టల్‌ బ్యాలెట్‌లు పంపిణీ చేశారు. గురువారం నుంచి బాక్సులో పోస్టల్‌ బ్యాలెట్‌ వేయవచ్చని అధికారులు తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌ రూములో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్‌ పేపర్లను ప్రత్యేక వాహనంలో డివిజన్‌ కేంద్రాలకు తరలించారు. మూడు డివిజన్‌లకు మొత్తం 22 రూట్ల వారీగా వాటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు డివిజన్‌లు, పోలింగ్‌ కేంద్రాల వారీగా బ్యాలెట్‌ పేపర్లకు ప్రత్యేక సీరియల్‌ నంబర్లు కేటాయించారు. ఓటర్లు ప్రాధాన్యత క్రమంలో బ్యాలెట్‌ పత్రాలపై నంబర్లు వేయడానికి ఎన్నికల సంఘం సమకూర్చిన ప్రత్యేకమైన పెన్నులు, ఇంకు బాటిళ్లు, సీలు ఇతర సామగ్రిని పోలింగ్‌ కేంద్రాల వారీగా పంపిణీ చేశారు. మొత్తం ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు పర్యవేక్షించారు. దీనిలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ ఉమాదేవి, వైఎస్సార్‌ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్‌తో పాటు బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### భైరవకోనలో పూజలు చేసిన జిల్లా అధికారులు



అధికారులను ఆశీర్వదిస్తున్న పూజారులు

సీఎస్‌ పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో బుధవారం జిల్లా అధికారులు పూజలు చేశారు. ఫిషరీస్‌ జాయింట్‌ డైరెక్టర్‌ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ ఎస్‌.శ్రీనివాస బాబు భైరవకోనలోని జలపాతాన్ని సందర్శించి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకటనర్సయ్య, పంచాగ్నుల రామమూర్తిశర్మ, సుధాకర్‌శర్మ అధికారులకు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం ఘనంగా వారిని సన్మానించారు.



కేక్‌ కట్‌ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, పోతుల సునీత, గంగాడ సుజాత, బాలినేని శచీదేవి, మీనాకుమారి



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌ చేతుల మీదుగా సన్మానం పొందిన మహిళా ఉద్యోగులు

## మహిళా పక్షపాతి జగనన్న

- 55 శాతానికిపైగా మహిళలకు పదవులు
- 90 శాతానికి పైగా పథకాలు మహిళల పేరుమీదే
- వైనాట్‌ 175 అనేదే మనందరి ముందున్న లక్ష్యం
- జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి నేతృత్వంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, బాలినేని సతీమణి శచీదేవి, ఒంగోలు అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ చైర్‌పర్సన్‌ సింగరాజు మీనాకుమారి, నగర మేయర్‌ గంగాడ సుజాతతోపాటు పలువురు మహిళా నాయకురాళ్లు పాల్గొని కేక్‌ కట్‌ చేసి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన నవరత్నాల హామీలను నెరవేర్చడమే కాకుండా స్థానిక సంస్థల్లో సైతం 50 శాతానికి పైగా పదవులను మహిళలకు కేటాయించిన ఘనత మన ముఖ్యమంత్రిదన్నారు. 90 శాతానికిపైగా ప్రభుత్వ పథకాలు మహిళల పేరుమీదనే ఇస్తున్నారని, దేశచరిత్రలో మహిళలకు దక్కిన అత్యంత అరుదైన గౌరవం అన్నారు. టీడీపీలో ఉన్న మహిళా నాయకురాళ్లు జగన్‌మోహన్‌రెడ్డిని దూషిస్తున్న తీరు వారి దుర్మార్గపు నైజానికి నిదర్శనమని, ఏది ఏమైనా 2024 ఎన్నికల్లో వైనాట్‌ 175 మన లక్ష్యమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పాట రూపంలో మహిళల ఖ్యాతిని గురించి వివరించారు.

ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి నాడు వెన్నుదన్నుగా మహిళలు నిలిచారని, అందుకే నేడు ఆయన ప్రవేశపెట్టే పథకాలన్నీ మహిళల పేరుమీదనే కొనసాగిస్తున్నారన్నారు. చట్టసభల్లో మహిళలకు 55 శాతం సీట్లు కేటాయించిన ఏకైక చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిదని, మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయించాలంటూ దశాబ్దాలుగా మహిళలు గొంతెత్తి అరుస్తున్నా అందుకు అవకాశం దక్కడంలేదని, కానీ మన రాష్ట్రంలో మాత్రం 55 శాతం సీట్లు కేటాయించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి అక్క చెల్లెమ్మలకు ఎంత అండగా ఉంటున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. నాడు పూలే, అంబేద్కర్‌లు మహిళలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షిస్తే నేడు వారి ఆలోచనలు స్ఫూర్తిగా తీసుకుని వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అభినవ పూలే, అంబేద్కర్‌గా పాలన సాగిస్తున్నారన్నారు. కేవలం చట్టసభల్లోనే కాకుండా స్థానిక సంస్థల్లో సైతం మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని, అందుకు నిదర్శనమే జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఒడా చైర్‌పర్సన్‌ సింగరాజు మీనాకుమారి అన్నారు. బీసీ మహిళనైన తనకు మూడోమారు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఆయన ఆశయం అయిన వైనాట్‌ 175ను సాధించేందుకు కృషిచేస్తానన్నారు.



మ్యూజికల్‌ చైర్‌ గేమ్‌ ఆడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, మేయర్‌ గంగాడ సుజాత, బాలినేని సతీమణి శచీదేవి, ఒడా చైర్‌పర్సన్‌ మీనాకుమారి

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి మాట్లాడుతూ పాలనలో మహిళలకు అత్యధిక భాగస్వామ్యం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లాలో అందుకు కృషిచేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డికి అండగా ఉంటున్న ప్రతి మహిళకు ధన్యవాదాలు తెలిపారు. ఒడా చైర్‌పర్సన్‌ సింగరాజు మీనాకుమారి, నగర మేయర్‌ గంగాడ సుజాత మాట్లాడుతూ అన్న సైన్యం అంటే మహిళలే అని, ఆ మహిళలే 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని, రాష్ట్ర మంత్రిగా బాలినేని శ్రీనివాసరెడ్డి అయ్యేవరకు అలుపెరగని కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బాలినేని సోదరి సుంకర రవణమ్మ, ఏపీ టైలర్స్‌ వెల్ఫేర్‌ బోర్డు చైర్‌పర్సన్‌ షేక్‌ సుభాన్‌బీ, మేదర కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కేతా లలిత నాంచారమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్‌ ఇన్‌చార్జి బడుగు ఇందిర, వైఎస్సార్‌ సీపీ నాయకురాళ్లు బైరెడ్డి అరుణ, కావూరి సుశీల, ఏపీ సీపీడీసీఎల్‌ డైరెక్టర్‌ జిల్లెల్లమూడి రమాదేవి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా మ్యూజికల్‌ చైర్స్‌:**

ముందుగా పార్టీ కార్యాలయంలోని వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మ్యూజికల్‌ చైర్స్‌ పోటీలు నిర్వహించారు. దాదాపు 20 మందికిపైగా మహిళా నాయకురాళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ వెంకాయమ్మ, బాలినేని సతీమణి శచీదేవి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## చదువులతోనే సాధికారత

- బాల్య వివాహాలతో మహిళలకు ఇబ్బందులు
- స్వయం సహాయక సంఘాలతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి
- జిల్లా జడ్జి భారతి, కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌



జిల్లా జడ్జి భారతిని సన్మానిస్తున్న కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌


ఒంగోలు అర్బన్‌: చదువుకోవడం వలన అన్నీ రకాలైన అవగాహన కలిగి మహిళలు చైతన్యవంతంగా ఉండవచ్చని, తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. స్వశక్తి, స్వీయ నిర్ణయం తీసుకునేలా ప్రతి మహిళా ఎదగాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో బుధవారం స్పందన భవనంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్యామ్‌బాబులతో కలిసి జిల్లా జడ్జి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా జడ్జి భారతి మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు ఏర్పడటంతో పాటు సామాజికంగా ఆర్థికంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ప్రతి మహిళా విద్యావంతురాలు కావాలని ఆమె పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే వివాహం చేసుకోవడం వలన తాను చదువుకోలేకపోయానని, తర్వాత దూర విద్య ద్వారా 32 ఏళ్ల వయసులో న్యాయ విద్యను అభ్యసించినట్లు తెలిపారు. తదుపరి న్యాయవృత్తిలో స్థిరపడ్డానని స్ఫూర్తిని కలిగించారు. గృహహింస, లైంగిక వేధింపుల కేసుల్లో బాధితులుగా ఉన్న మహిళలకు న్యాయం చేయడం న్యాయమూర్తిగా సంతృప్తిని పొందానన్నారు. ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా తాను ఈ స్థితికి ఎదగగలిగానన్నారు. చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. అంతేకాకుండా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి లభిస్తుందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి బాలిక కనీసం 18 సంవత్సరాల వయసు నిండే వరకు చదువుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీఓలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీల సహకారంతో బాల్య వివాహాలను నివారిస్తున్నామన్నారు. గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో 46 బాల్య వివాహాలను అడ్డుకున్నామని చెప్పారు.

డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్యామ్‌బాబు మాట్లాడుతూ మహిళలు ప్రవేశించలేని రంగం ఏదీ లేదన్నారు. దీన్నిబట్టి మహిళలు ఎంత చురుకైన వారో అర్థమవుతుందన్నారు. అయినా వారికి వేధింపులు, వివక్ష తప్పకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి బాధితులకి న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలుస్తుందని చెప్పారు. దీనిపై మహిళల్లో అవగాహన కల్పించడంలో తమవంతు పాత్ర పోషించాలని స్వయం సహాయక సంఘాలను కోరారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా జడ్జి, కలెక్టర్‌, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శిలను ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా మహిళా అధికారులను అతిథులు సత్కరించారు. స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు ప్రశంస పత్రాలు అందజేశారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ రవికుమార్‌, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్లు గ్లోరియా, ఉమాదేవి, సచివాలయాల కో ఆర్డినేటర్‌ ఉషారాణి, ఐసీడీఎస్‌ ఇన్‌చార్జ్‌ పీడీ మల్లేశ్వరి, జిల్లా సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్‌ ముగిసేలోగా పరిహారం అందిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి. భారీ వర్షాలు, తుఫాన్‌లు ఇలా ప్రకృతి విపత్తులతో నష్టపోయిన అన్నదాతలకు తోడు నీడగా నిలుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పంట నష్టపోయిన 31,117 మంది రైతులకు రూ.27.65 కోట్ల ఇన్‌పుట్‌ సబ్సిడీని అందించారు. రైతు భరోసాతో పాటు ఇన్‌పుట్‌ సబ్సిడీ ఒకేసారి ఖాతాల్లో జమకావడంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

## అన్నదాతకు తోడు..నీడగా..



- జిల్లాలో రూ.27.65 కోట్ల ఇన్‌పుట్‌ సబ్సిడీ
- జిల్లాలో 31,117 మంది రైతులకు లబ్ధి
- కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా రూ.11.93 కోట్లు 13,878 మంది రైతు ఖాతాల్లో జమ
- మాండూస్‌ పరిహారం అందడంతో రైతుల్లో ఆనందం

కనిగిరి రూరల్‌: మాండూస్‌ తుఫాన్‌ ప్రభావంతో గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పెద్ద మొత్తంలో రైతులు నష్టపోయారు. జిల్లాలో 25,259.12 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లింది. 28,559 మంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన మండలాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. వెంటనే వాటిని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఏ సీజన్‌లో ఏర్పడిన నష్టానికి అదే సీజన్‌ ముగిసేలోగా పరిహారం ఇస్తానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఫిబ్రవరి 28వ తేదీన రైతు భరోసా తోపాటు పంట నష్టానికి సంబంధించి ఇన్‌పుట్‌ సబ్సిడీని జమచేశారు. జిల్లాలో నష్టపోయిన రైతులకు రూ.25.502 కోట్లు ఇచ్చారు. అలాగే ఉద్యానవన శాఖకు సంబంధించి జిల్లాలో 2,558 మంది రైతులు 1455.05 హెక్టార్లలో పంట నష్టపోయారు. వారికి సైతం రూ.2.15 కోట్లు సబ్సిడీని అందించారు. రెండు శాఖలకు సంబంధించి మొత్తం 26,714.72 హెక్టార్లు విస్తీర్ణంలో పంట నష్టపోయిన 31,117 మంది రైతులకు రూ.27.65 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఒక్క కనిగిరి వ్యవసాయ సబ్‌ డివిజన్‌లోని ఆరు మండలాలకు చెందిన 13,878 మంది రైతులకు రూ.11.93 కోట్ల పరిహారం అందించినట్లు అధికారులు చెప్పారు.

**అత్యధికం కనిగిరి నియోజకవర్గానికే..**

మాండూస్‌ తుఫాన్‌ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పంట నష్ట పరిహారం కనిగిరి నియోజకవర్గంలోని రైతులకే అత్యధికంగా వచ్చినట్లు సమాచారం. అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పంట దెబ్బతిన్న ఏ ఒక్క రైతు నష్టం పోకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌ యాదవ్‌ ఆదేశించారు. ఈమేరకు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఫలితంగా కనిగిరి ప్రాంత రైతులకు నష్ట పరిహారం జాబితాలో ఎక్కువ మందికి న్యాయం జరిగింది. పంట నష్టపరిహారం కింద ప్రతి హెక్టారుకు వరికి, పత్తికి రూ.15 వేలు లెక్కన, కంది, పెసర, మినుము, బొబ్బర, పొగాకుకు రూ.10 వేల లెక్కన పరిహారం జమ చేశారు. ఒక్క పామూరు మండలంలోని పొగాకు నష్టపోయినట్లు నివేదికలున్నాయి. పొగాకు రైతుల ఖాతాల్లో నగదు జమకావాల్సి ఉంది. వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఆరు మండలాలకు చెందిన 13,878 మంది రైతులకు వివిధ పంటలు 11,878.14 హెక్టార్లకు పరిహారం కింద ఇన్‌పుట్‌ సబ్సిడీ రూ.11.93 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే కనిగిరి పరిధిలోని ఉద్యాన రైతులకు 163.66 హెక్టార్లలో 239 మంది రైతులకు, రూ.24 లక్షలు పంట నష్ట పరిహారం జమైనట్లు చెప్పారు. ఎటువంటి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకి జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నియోజకవర్గంలో అత్యధికంగా హనుమంతునిపాడు మండల రైతులకు 5,561 మందికి పరిహారం లబ్ధి జరిగింది. ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో 80 శాతం మందికి పైగా జమ కాగా, సాంకేతిక కారణాలతో కొంత మందికి ఆలస్యంగా నగదు ఖాతాల్లోకి పడనున్నాయి.

**మండలాల వారీగా వ్యవసాయశాఖ పరిహారం రైతుల వివరాలు**

| మండలం | రైతులు | పంట విస్తీర్ణం (హెక్టార్లలో) | ఖాతాల్లో జమైన నగదు (రూ.లక్షల్లో) |
| --- | --- | --- | --- |
| పామూరు | 1,508 | 1321.92 | 132.78 |
| పీసీపల్లి | 1,834 | 1563.13 | 156.90 |
| వెలిగండ్ల | 2,927 | 2241.23 | 224.77 |
| కనిగిరి | 1,455 | 1398.78 | 140.07 |
| హెచ్‌ఎంపాడు | 5,561 | 4737.32 | 474.45 |
| సీఎస్‌పురం | 593 | 615.76 | 64.70 |
| మొత్తం | 13,878 | 11,878.14 | 1193.67 |



**నేరుగా మా ఖాతాల్లోకే**



ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతులను సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. ఎవరి దగ్గరకు వెళ్లకుండా నేరుగా మా ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. తుఫాన్‌ దెబ్బకు 3 ఎకరాల్లో మినుము పంట దెబ్బతింది. దీనికి ప్రభుత్వం సుమారు రూ.12 వేల ఇన్‌పుట్‌ సబ్సిడీ ఖాతాల్లో జమ చేశారు.

– వేమా తిరుపతిరెడ్డి, చిన అలవలపాడు

**పేద రైతుల పాలిట దేవుడు సీఎం వైఎస్‌ జగన్‌**



సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేద రైతుల పాలిట దేవుడు. నాలుగేళ్ల పాలనలో రైతులకు ఎంతో అండగా నిలిచారు. మాండూస్‌ తుఫాన్‌ ప్రభావంతో నేను వేసిన మినుము పంట 1.94 ఎకరాల్లో నష్ట పోయాను. ప్రభుత్వం నాకు ఇన్‌పుట్‌ సబ్సిడీ కింద రూ.7,760 నగదు నేరుగా బ్యాంక్‌ ఖాతాలో జమ చేశారు.

– వంగేపురం సురేష్‌, యడవల్లి

## ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి సీఎంకు కానుకగా ఇవ్వాలి
- పార్టీ రీజినల్‌ కోఆర్డినేటర్‌ బాలినేని శ్రీనివాసరెడ్డి

సాక్షి, తిరుపతి:

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కోఆర్డినేటర్‌, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులకు పిలుపునిచ్చారు. తిరుపతిలో బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌ రెడ్డి, ద్వారకానాథరెడ్డి, నవాజ్‌ బాషా, ఆదిమూలం, రామచంద్రారెడ్డి, ఎమ్‌ ఎస్‌ బాబు, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్‌, ఎమ్మెల్సీలు భరత్‌, సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యాంప్రసాదరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమారరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్లను పోలింగ్‌ కూడా వచ్చేలా అందరం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఎన్నికలను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రతిపక్షాల దుర్మార్గపు ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులంతా కలిసికట్టుగా తిప్పికొట్టాలని కోరారు. విశాఖపట్టణంలో నిర్వహించిన గ్లోబల్‌ సమ్మిట్‌ అత్యంత విజయవంతంగా పూర్తి చేసిన మన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించి కానుకగా ఇద్దామని అన్నారు. ఎక్కడా ఉదాసీనతకు తావులేకుండా ఒక ప్రణాళిక ప్రకారం గెలుపు దిశగా పార్టీ నాయకులను, కార్యకర్తలను నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. చిన్నపాటి విభేదాలు ఉంటే వీడి అందరినీ కలుపుకు పోవాలని దిశా నిర్దేశం చేశారు. పోలింగ్‌ రోజు చాలా చురుకుగా ఉండాలని కోరారు. గెలుపే లక్ష్యంగా పని చేద్దాం అని వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కోఆర్డినేటర్‌ బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్‌ కోఆర్డినేటర్‌ బాలినేని శ్రీనివాసరెడ్డి

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

దర్శి: మిరప తోటకు నీరు పెట్టేందుకు వెళ్లిన యువ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం దర్శి మండలం అబ్బాయిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన క్రిష్టిపాటి శ్రీనివాసరెడ్డి(27) అనే యువకుడు పొలం పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మిరప తోటకు నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేయాలనే ఉద్దేశంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి తీగలు తగిలించాడు. తగిలించిన రెండు తీగల్లో ఒక తీగ ఊడి కింద పడి నీళ్లలో ఉన్న కాలికి తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రామకృష్ణ పరిశీలించారు.

### కారు ఢీకొని యువకుడు మృతి


ప్రమాదంలో మృతి చెందిన సురేష్

పొదిలి రూరల్: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన పొదిలి మండలంలోని తలమళ్ల దగ్గర ఒంగోలు–కర్నూలు రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పొదిలి మండలం రామాపురం గ్రామానికి చెందిన సోముల శివకృష్ణ ఒంగోలు నుంచి కారులో వస్తున్నాడు. పొదిలి విశ్వనాథపురానికి చెందిన దాసు సురేస్(30) పొదిలి నుంచి బైక్‌పై ఒంగోలు వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో తలమళ్ల గ్రామం వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్‌పై వస్తున్న దాసు సురేష్‌కు బలమైన గాయాలు కావడంతో పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పొదిలి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

# ధర స్థిరం అదే వరం!

పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతుల మోముల్లో చిరునవ్వులు విరబూస్తున్నాయి. కేజీ పొగాకు ధర గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.195, సరాసరిన రూ.198 పలుకుతుండటంపై రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే ధర స్థిరంగా కొనసాగినట్లయితే ఈ ఏడాది లాభాలతో గట్టెక్కినట్లేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.



- సరాసరిన కేజీ పొగాకు రూ.198, గరిష్టం రూ.200, కనిష్టం రూ.195
- ఇదే ధర స్థిరంగా ఉంటే రైతులు లాభాలతో గట్టెక్కినట్లే..
- ఇప్పటి వరకు నాలుగు ప్లాట్‌ఫాంలలో 10,500 బేళ్ల వరకు కొనుగోళ్లు
- నేటి నుంచి ఫేజ్–2 కింద మరో 7 ప్లాట్‌ఫాంలలో వేలం ప్రారంభం
- 101 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేస్తామని బోర్డు ప్రకటన
- గత ఏడాది 47,512 హెక్టార్లలో పొగాకు సాగు
- ఈ ఏడాది 63,410 హెక్టార్లకు పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం
- కర్నాటకలో పొగాకు దిగుబడి తగ్గడంతో ఆంధ్రాలో గిరాకీ పెరుగుతుందని రైతుల అంచనా
- చైనాలో పరిస్థితులూ కలిసొస్తాయని ఆశ

చీమకుర్తి:

జిల్లాలో ఫేజ్–1 వేలం ప్రక్రియ పొగాకు రైతులకు ఆశాజనకంగా ఉంది. ఒంగోలు–1, కొండపి, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ గత నెల 24న ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు కేంద్రాల్లో సరాసరిన ఇప్పటి వరకు 12 వేల పొగాకు బేళ్ల వరకు వేలానికి రాగా వాటిలో నోబిడ్, కంప్యూటర్ రిజెక్షన్, రైతు రిజెక్షన్ కారణంగా సుమారు 1500 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. సుమారు 10,500 బేళ్లకు సరాసరిన కేజీ రూ.198 చొప్పున ధర పలికింది. అంటే క్వింటా సరాసరిన రూ.19,800 ధర పలికినట్లయింది. దీంతో ఫేజ్–1లోని నాలుగు ప్లాట్‌ఫాంలలో రైతులందరూ ఇప్పటి వరకు మంచి ధరే పలికిందని, ఇక ధర పెరగకపోయినా ఫర్వాలేదు కానీ తగ్గకుండా స్థిరంగా ఉంటే చాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### నేటి నుంచి ఫేజ్–2 వేలం

గత ఏడాది జిల్లాలో 47,512 హెక్టార్లలో రైతులు పొగాకు సాగు చేయగా 76 మిలియన్ కేజీలను టుబాకో బోర్డు కొనుగోలు చేసింది. ఈ ఏడాది జిల్లాలో 63,410 హెక్టార్లలో పొగాకు సాగు చేయగా 101 మిలియన్ కేజీలు కొనుగోలు చేయాలని టుబాకో బోర్డు నిర్ణయించింది. గురువారం నుంచి ఫేజ్–2లో ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని ఒంగోలు–2, టంగుటూరు, కనిగిరి, కందుకూరు–1, 2, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఐటీసీ, జీపీఐ, అలయెన్స్, పీటీపీ, ముస్తాఫా, విజయ భారతి, మారుతి తదితర కంపెనీలు మాత్రమే జిల్లాలో తొలి దశలో వేలం జరుగుతున్న 4 ప్లాట్‌ఫాంలలో పాల్గొన్నాయి. మిగిలిన 7 ప్లాట్‌ఫాంలలో కూడా కొనుగోళ్లు ప్రారంభమైతే బయ్యర్ల మధ్య డిమాండ్ ఏర్పడుతుందని, ధర పెరగవచ్చని రైతులు భావిస్తున్నారు.


ఒంగోలు–1 కేంద్రంలో వేలానికి ఉంచిన పొగాకు బేళ్లు

### కర్నాటక, చైనాలో పరిస్థితులతో ధరపై ఆశ

కర్నాటకలో పొగాకు అనుకున్న స్థాయిలో ఉత్పత్తి కాకపోవడంతో అక్కడ కొనుగోళ్లు తగ్గిపోయాయని రైతుల్లో ఒక విశ్లేషణ ఉంది. దాని ఆధారంగా ఆంధ్రాలో పొగాకు కొనుగోళ్లు పెరగవచ్చని, కర్నాటకలో పొగాకు తగ్గినందున కంపెనీల మధ్య డిమాండ్ ఏర్పడి ధర కూడా క్వింటా రూ.20 వేల నుంచి రూ.23 వేల వరకు పెరుగుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. గతంలో రెండేళ్లకు సరిపడా పొగాకు నిల్వ ఉంచుకునే చైనాలో కరోనా కారణంగా నిల్వలు తగ్గిపోవడంతో ఎగుమతులు భారీగా పెరుగుతాయని రైతుల్లో నమ్మకం పెరిగింది. తొలి వారం రోజుల్లో రైతులు వేలం కేంద్రాలకు మంచి నాణ్యమైన పొగాకును తీసుకురాలేదని బోర్డు అధికారుల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. రోజులు గడిచే కొద్దీ మంచి రేటు వస్తే అప్పుడు నాణ్యమైన పొగాకును తీసుకురావచ్చని భావిస్తున్న రైతులు నాణ్యమైన పొగాకును కోల్డ్‌స్టోరేజీల్లో ఉంచారనే ప్రచారం నడుస్తోంది. గత రెండు మూడు రోజులుగా మంచి ధర వస్తుండటంతో ఇప్పుడిప్పుడే కోల్డ్ స్టోరేజీల్లో ఉంచిన పొగాకును వేలానికి తీసుకొస్తున్నారని, ఇంకా నాణ్యమైన పొగాకు వస్తే బయ్యర్లు మంచి ధర ఇచ్చే అవకాశం ఉందని బోర్డు అధికారులు రైతులకు సమాచారం ఇస్తున్నారు.

### 101 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు లక్ష్యం

గత ఏడాది 76 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశాం. ఈ సంవత్సరం 101 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు సరాసరిన కేజీ పొగాకు రూ.198 ధర పలికింది.

– తులసి, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్,ఒంగోలు

### ఫేజ్-2 నుంచి డిమాండ్ పెరగొచ్చు

ఫేజ్–2 కింద గురువారం నుంచి మరో 7 కేంద్రాల్లో పొగాకు వేలం ప్రారంభమవుతుంది. బయ్యర్లు పెరిగే అవకాశం ఉంది. నాణ్యమైన పొగాకు వస్తే ఇంకా ధర పెరిగే అవకాశం ఉంది. కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నాణ్యమైన పొగాకును వేలం కేంద్రాలకు రైతులు తీసుకురావాలి.

– రవికాంత్, ఒంగోలు–1 వేలం కేంద్రం సూపరింటెండెంట్

### ఇదే ధర స్థిరంగా ఉంటే చాలు



ఇప్పటి వరకు వేలంలో పొగాకు ధర సంతృప్తికరంగా ఉంది. కేజీ ధర రూ.198 నుంచి రూ.200 వరకు పలికింది. కర్నాటకలో పొగాకు ఉత్పత్తి తగ్గింది కాబట్టి మన రాష్ట్రంలో పొగాకుకు బయ్యర్ల నుంచి డిమాండ్ పెరుగుతుందనే ఒక నమ్మకం ఉంది. ఇప్పుడిస్తున్న ధర తగ్గకుండా ఉంటే రైతులు లాభాలతో బయటపడినట్లే.

– యర్రగుంట్ల మోహన్‌రావు, పొగాకు రైతు, కేవీపాలెం

# నాయకత్వ లక్షణాలతో ఉన్నత స్థానం


పోలీసు కార్యాలయ మహిళా ఉద్యోగినులతో ఎస్పీ మలికా గర్గ్

- మహిళా ఉద్యోగులతో ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: మహిళా ఉద్యోగులు ఉత్తమ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్పీ మలికా గర్గ్ ఆకాంక్షించారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో సమాజంలో గౌరవనీయమైన స్థానానికి చేరుకోవాలని సూచించారు. విధుల్లో పురుషులతో సమానంగా పనిచేయడం గరించదగ్గ విషయమని కొనియాడారు. తమలోని సహజ సృజనాత్మకతను స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణపై తగిన శ్రద్ధ వహించాలని, నిత్యం క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం ద్వారా శారీరక దృఢత్వాన్ని పరిరక్షించుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ ఎం.సులోచన, మహిళా ఎస్సైలు ఫిరోజ్ ఫాతిమా, కె.దీపిక, బి.అజిత, కృష్ణ పావని, శ్రావ్య, డీపీఓ సూపరింటెండెంట్ సత్యవాణి, శైలజ, భాను తదితరులు పాల్గొన్నారు.

# భక్తి పరవశం.. శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కొనకనమిట్ల: జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తి పరవశంతో జరుగుతున్నాయి. బుధవారం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వేదపండితులు ప్రసాదాచార్యులు, వెంకటాచార్యులు, వైష్ణవ యుగంధర్‌చార్యులు, దేవులపల్లి రామపవన్‌కుమార్‌శర్మ స్వామి వార్లకు సుప్రభాతసేవ, విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజ, హోమాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. అనంతరం ఉభయ దాతలు పోలంరాజు కొండలరావు సన్స్, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డిల పర్యవేక్షణలో ధ్వజారోహణ కార్యక్రమం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిపించారు. గురువారం తెల్లవారుజామున శ్రీవారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

### కోడి పందేల శిబిరంపై దాడి

చీమకుర్తి: మండల పరిధిలోని గాడిపర్తివారిపాలెం పొలాల్లో కోడి పందేల శిబిరంపై ఎస్ఈబీ పోలీసులు బుధవారం దాడి చేశారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్సై నగేష్ తెలిపారు. నిందితుల నుంచి 6 కోడి పుంజులు, 27 కోడికత్తులు, 12 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఈబీ ఎస్సై తెలిపారు.


జూదరుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, కత్తులు

# తాళ్లూరులో భారీ చోరీ


బాధితులతో మాట్లాడుతున్న దర్శి సీఐ, ఎస్సైలు


తాళ్లూరులో చోరీ జరిగిన నివాసం

- 66 సవర్ల బంగారం, రూ.4 లక్షల నగదు కాజేసిన దుండగులు
- శింగరకొండ తిరునాళ్లకు వెళ్లిన కుటుంబ సభ్యులు

తాళ్లూరు: తాళ్లూరు నడిబొడ్డున కిరాణా వ్యాపారి ఇంట్లో దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. కుటుంబం మొత్తం శింగరకొండ తిరునాళ్లకు వెళ్లగా ఆ నివాసంలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న దొంగలు ప్రతి గదిని సోదా చేసి మరీ సొమ్ము, నగదు దోచుకువెళ్లారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. తాళ్లూరుకు చెందిన చందోలు శ్రీనివాసరావు రామాలయం పక్కన నివాసం ఉంటున్నారు. కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి శింగరకొండ తిరునాళ్లకు వెళ్లారు. యజమాని శ్రీనివాసరావు ముందుగా ఒంటి గంట సమయంలో వచ్చినా తాళాలు లేకపోవడంతో ఎదురింట్లో నిద్రిస్తూ కుటుంబ సభ్యుల కోసం వేచి చూశారు. 3.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులు వచ్చి మెట్ల వద్ద గేటు తాళం తీసి పైకి వెళ్లి ప్రధాన ద్వారం తాళం తీయడానికి ప్రయత్నించగా తలుపు తెరుచుకోలేదు. లోపలి వైపు బోల్టు పెట్టినట్లు ఉండటంతో బంధువులకు సమాచారం ఇవ్వగా గ్రామంలోని వడ్రంగిని పిలిపించి తలుపులు తెరిచారు. ఇంట్లో సెల్ఫ్‌లు తెరిచి ఉండటం, బెడ్ రూంలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గ్రహించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ప్రేమ్‌కుమార్ పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దర్శి సీఐ రామకోటయ్య, క్లూస్ టీం ఎస్సై శరత్‌కుమార్ వచ్చి ఆధారాలు సేకరించారు. రూ.27 లక్షల విలువైన 66 సవర్ల బంగారం, శ్రీనివాసరావు గదిలో రూ.3 లక్షలు, కుమారుడు మణి గదిలో రూ.లక్ష, కుమార్తె దాచుకున్న పాకెట్ మనీతో సహా పూర్తిగా దోచుకెళ్లారు. అయితే నివాసంలో ఉన్న వెండి వస్తువులను మాత్రం దొంగలు వదిలేశారు. కుమార్తె పెళ్లి కోసమని దాచుకున్న బంగారం, నగదును దుండగులు దోచుకెళ్లడంతో కుటుంబ సభ్యులంతా బోరున విలపిస్తున్నారు. బాధితుడు శ్రీనివాసరావును ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.


నివాసంలో చిందరవందరగా పడిన వస్తువులు


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

# వైభవంగా నృసింహుని రథోత్సవం

మర్రిపూడి: పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకట రమణాచార్యులు, ఆదిశేషాచార్యులు, మురళీకృష్ణమూర్తిచార్యులు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా సిద్ధం చేసిన పల్లకిపై స్వామివారిని మాడవీధుల్లో ఘనంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలవల వెంకట సుబ్బయ్య, అలవల రాధయ్య, అలవల చెంచు లక్ష్మీన్నారాయణ, అలవల చెంచుసుబ్బారావు కుమారులు ఉభయదాతలుగా వ్యవహరించారు.


పల్లకిపై ఊరేగుతున్న లక్ష్మీనృసింహస్వామి

# ఆదరించండి.. అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ప్రచారం


ఓటర్లకు నమూనా బ్యాలెట్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి చీమకుర్తిలోని 9వ వార్డు పరిధిలో స్థానిక పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లకు నమూనా బ్యాలెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, మన్నం శ్రీధర్, కౌన్సిలర్లు కంజుల ప్రతాప్ రెడ్డి, బడే అయ్యపరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక నాయకులు మంచా హరికృష్ణ, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.